నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, సోమవారం 16 డిసెంబర్ 2024 | NAGARKURNOOL

పొగమంచుకు జాతీయ రహదారిపై లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనాలు

మంచు కమ్ముకోవడంతో జాతీయ రహదారిపై పక్కన నిల్చున్న వాహనాలు

కమ్మేసిన పొగమంచు

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 15 : అలంపూర్ నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఆదివారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటలైనా పొగమంచు, చలి తీవ్రత తగ్గలేదు. రోజు రోజు ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోవడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. కూలీలు చలిలో వణుకుతూ పొలాలకు వెళ్లే పరిస్థితి నెలకొన్నది. 44వ జాతీయ రహదారిపై పొగమంచు కమ్ముకోవడంతో లారీలు, పెద్ద పెద్ద వాహనాలు రోడ్డు పక్కన నిలుపుకొన్నారు. కొందరు వాహనదారులు హెడ్ లైట్ వెలుతురులో నెమ్మదిగా ప్రయాణాలు సాగించారు. ఉండవెల్లి సమీపంలో పొగ మంచులో రైలు వస్తున్న దృశ్యం, జాతీయ రహదారిపై నిల్చున్న లారీలు, హెడ్ లైట్ వెలుతురులో వస్తున్న వాహనాలు దృశ్యాలు కెమెరాకు చిక్కాయి.

రామాపురంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

హామీలను గాలికొదిలేసిన సర్కార్

- ఏడాది గడిచినా అమలుకాని ఆరు గ్యారెంటీలు
- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పెంట్లవెల్లి, డిసెంబర్ 15 : ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను గాలికొదిలేసిందని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి విమర్శించారు. కొల్లాపూర్ మండలంలోని రామాపురంలో ఆదివారం బీఆర్ఎస్ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడిచినా ఇప్పటివరకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. మార్పు, మార్పు అంటూ రేవంత్‌రెడ్డి సర్కార్ తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేస్తుందన్నారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి రైతులను రాజును చేస్తే.. నేడు కాంగ్రెస్ సర్కార్ సంక్షేమ పథకాలను తుంగలో తొక్కి రైతులకు బేడీలు వేసి కేడీలను చేసి జైలుకు పంపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొందరు రైతులు పెంట్లవెల్లి సొసైటీలో పంట రుణాలు తీసుకున్నామని తమకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని మాజీ ఎమ్మెల్యే బీరం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 వరకు రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతామని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నేటి వరకు 50శాతం మాత్రమే రుణమాఫీ చేసి చేతులు దులుపుకుందని, పైగా రైతు సంబురాలు చేసుకోవడం విడ్డూరమన్నారు. పెంట్లవెల్లి సొసైటీలో 499 మంది రైతులు పంటరుణాలు తీసుకోగా ఇందులో ఒక్క రైతుకూ కూడా నయా పైసా మాఫీ వర్తించలేదని ఆయన మండిపడ్డారు. కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే, మంత్రి జూపల్లి కృష్ణారావు పెంట్లవెల్లి సొసైటీ రైతుల గోడును పట్టించుకోకపోవడానికి గల కారణం ఏమిటని ప్రశ్నించారు. కొద్ది రోజుల కిందట ఓ మీడియా చానల్ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాలనపై సర్వే నిర్వహించగా 32శాతం పరవాలేదని, 62 శాతం చెత్తగా ఉందని రిపోర్ట్ వచ్చిందన్నారు. ఇంత తక్కువ సమయంలో ప్రజల్లో వ్యతిరేకత వచ్చిన ప్రభుత్వం రేవంత్‌రెడ్డి సర్కారే అని మాజీ ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాజేశ్, నరేందర్‌రెడ్డి, కట్టా శ్రీనివాసులు, కాటం జమ్ములయ్య బీఆర్ఎస్ గ్రామ నాయకులు నిరంజన్, గోపాల్ యాదవ్, శరమంద, దర్గయ్య, రాముడు, వంశీ, శేఖర్‌రెడ్డి, బాలయ్య, రాంచందర్, నరేశ్, మల్లేశ్, నాగరాజు, వెంకటస్వామి ఉన్నారు.

అక్రమంగా రాష్ట్రంలోకి వచ్చిన లారీలు

అక్రమంగా తెలంగాణలోకి..

- సరిహద్దులు దాటి వస్తున్న ధాన్యం
- లారీలను సీజ్ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి

మాగనూరు/ కృష్ణ డిసెంబర్ 15 : అక్రమంగా తెలంగాణలోకి వరి ధాన్యం తరలిస్తున్న ఆరు లారీలను పట్టుకొని సీజ్ చేసిన ఘటన కృష్ణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డీటీ గుర్రాజరావు, ఏవో సుదర్శన్ గౌడ్ కథనం ప్రకారం కృష్ణ మండలంలోని చేగుంట గ్రామ సమీపంలోని ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ నుంచి శుక్రవారం అర్ధరాత్రి కర్ణాటక నుంచి అక్రమంగా వరిధాన్యంతో తెలంగాణలోకి వస్తున్న 6 లారీలను అదుపులోకి తీసుకొని కృష్ణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లతో వివరాలు సేకరించగా కర్ణాటక రాష్ట్రంలోని సిరిపూర్ గ్రామం నుంచి తెలంగాణలోని మిర్యాలగూడ శివ శంకర ఇండస్ట్రీస్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. లారీలో 2,400 బస్తాలు ఉన్నాయని వాటి విలువ రూ.40 లక్షలకు పైనే ఉంటుందని తెలిపారు. లారీలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డీటీ గుర్రాజరావు ఆదివారం పరిశీలించి వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. అయితే ఆరు లారీల్లో 5,100 బస్తాలు ఉండవచ్చని వాటి విలువ రూ.50 లక్షలపై మాటేనని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒక అధికారి తప్పుడు సమాచారంతో పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పడంతో అధికారిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కబ్జాకోరులు!

- ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుంటున్న వైనం
- ఖాళీ జాగా కనిపిస్తే పాగా వేస్తున్న అక్రమార్కులు
- నీకు కొంచెం.. నాకు కొంచెం అంటూ వాటాలు
- అంతా అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే..
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఫిర్యాదు చేస్తే ఇప్పుడే తెలిసిందంటూ బుకాయింపు

గద్వాల, డిసెంబర్ 15 : జోగుళాంబ గద్వాల జిల్లాలో భూముల ధరలు అమాంతంగా పెరగడంతో నేతల కనుసన్నల్లో కబ్జాకోరులు బరి తెగిస్తున్నారు. చెరువులు, 10శాతం లేఅవుట్ స్థలాలు, మున్సిపాలిటీలో ఉన్న డ్రైనేజీలు కబ్జా చేసి వెంచర్లు, దుకాణాలు ఏర్పాటు చేసి అమ్మేస్తున్నారు. కలెక్టర్, ఉన్నతాధికారులు జిల్లా కేంద్రంలో ఉన్నా ఇవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వీటిపై ఎవరైనా అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇప్పుడే మా దృష్టికి వచ్చింది విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పి చేతులు దులుపుకుంటుడడంతో జిల్లా కేంద్రంలో కోట్ల విలువ చేసే ప్రాపర్టీలను కబ్జాకోరులు కొట్టేస్తున్నారు. వీరికి అధికారపార్టీ నాయకుల అండ ఉండడంతో వారి పని కానిస్తున్నారు. అధికారులకు అన్ని తెలిసినా ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది.

జిల్లా కేంద్రంలో పాలకేంద్రం సమీపంలో కొందరు రోడ్డు వేసుకొని ప్రభుత్వ భూమిని ప్లాట్లు చేసి అమ్ముకునేందుకు ఏర్పాట్లు చేస్తుండగా మున్సిపల్ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గద్వాల మార్కెట్ యార్డు సమీపంలో మున్సిపాలిటీకి చెందిన 20 ఫీట్ల డ్రైన్‌ను కబ్జాదారులు ఆక్రమించి 10 ఫీట్లకు కుదించి నిర్మాణాలు చేపడుతున్న మున్సిపల్ అధికారులు, పాలకమండలి, కలెక్టర్‌కు తెలియడం లేదంటే ఇక్కడి స్థలాలు ఆక్రమణదారులు ఏరీతిలో కబ్జాలు చేస్తున్నారో ఇట్టే తెలిసిపోతుంది. డ్రైనేజీ నిర్మాణం కూడా మున్సిపల్, మార్కెట్ యార్డు అధికారులకు తెలియడం లేదని చెబుతున్నారంటే పలు అనుమానాలకు తావిస్తున్నది.

డ్రైన్‌ను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు (ఫైల్)

మార్కెట్ యార్డు స్థలం కబ్జాకు ప్లాన్..

జిల్లా కేంద్రంలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిలో 1972లో 62.28ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్ యార్డు నిర్మించారు. అప్పుడు మార్కెట్ నుంచి మిల్లులకు ధాన్యాన్ని తరలించడానికి మార్కెట్ యార్డు పక్కన బండ్ల బాట 20 ఫీట్ల రోడ్డు ఉంది. దాని సమీపంలో డ్రైనేజీ ఏర్పాటు చేశారు. గద్వాల పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందడం డ్రైనేజీ సమీపంలో బీటీరోడ్డు ఏర్పాటు చేశారు. అయితే మార్కెట్ యార్డు ఆవరణలో కమీషన్ ఏజెంట్లు దుకాణాలు, ఇండ్లు ఏర్పాటు చేసుకున్నారు. వీరి ఇండ్ల, దుకాణ సముదాయం వెనుక భాగంలో బండ్ల బాటతో పాటు దాని పక్కనే డ్రైన్ నిర్మాణం ఏర్పాటు చేశారు. అయితే గతంలో మార్కెట్ యార్డు కార్యదర్శులుగా పనిచేసిన ఇద్దరు ఎవరికీ తెలియకుండా కమీషన్ ఏజెంట్ల దుకాణాల వెనుక భాగంలో ఉన్న స్థలాన్ని వారికి విక్రయించినట్లు తెలిసింది. ఇదే అదునుగా భావించి మార్కెట్ యార్డులోని 26మంది కమీషన్ దారులు చింతలపేటకు వెళ్లే దారిలో ఉన్న 20 ఫీట్ల డ్రైన్‌ను మార్కెట్‌యార్డు అధికారులు, మున్సిపల్ అధికారులకు తెలియకుండా 10 ఫీట్లకు కుదించి డ్రైన్ నిర్మాణం పనులు చేపట్టారు. ఈ నిర్మాణం తర్వాత దుకాణాలు, ఇండ్ల వెనుక భాగంలో ఉన్న స్థలాన్ని, డ్రైన్ స్థలాన్ని కలుపుకొని ప్రధాన రహదారి వైపు డ్రైన్‌పై దుకాణాలు నిర్మించడానికి కమీషన్ ఏజెంట్లు ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది.

పనులు చేపట్టి 6నెలలు కావస్తున్నా జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులకు ఈ నిర్మాణ విషయం తెలియక పోవడం కొసమెరుపు. మున్సిపాలిటీలో ఎవరైనా పేదవాడు చిన్న పాటి స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడితే గద్దల్లా వాలే అధికారులు ఇంత పబ్లిక్‌గా మున్సిపల్ పాలక మండలి, అధికారులకు తెలియకుండా డ్రైన్‌ల నిర్మాణం చేపడుతున్నారంటే ఇది అధికారులు, పాలకుల వైఫల్యంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరి అనుమతి లేకుండా ప్రైవేట్ వ్యక్తులు సొంతంగా మున్సిపల్ స్థలం కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నా ఎవరూ అటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. అంతా అయిపోయిన తర్వాత మార్కెట్ అధికారులు మార్కెట్ గోడ కూల్చకుండా ఉండాలని నోటీసులిచ్చారు. కబ్జాల పర్వం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు విజయ్‌కుమార్ కబ్జాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

కుదించి మున్సిపల్ డ్రైన్‌ను నిర్మిస్తున్న ప్రైవేట్ వ్యక్తులు

కబ్జాలకు నిలయంగా గద్వాల..

వడ్డించేవాడు మనోడైతే ఏ మూలన కూర్చున్న భోజనం మొదట మనకే వస్తది అనే సామెత ఇక్కడి కబ్జాకోరులకు వర్తిస్తుంది. అధికారులు , పాలకులతో కుమ్మక్కై జిల్లాకేంద్రంలో అనేక ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. కొన్ని స్థలాలు వెంచర్లు వేసి విక్రయిస్తున్నారు.

ఇప్పటివరకు జరిగిన కబ్జాలు..

➪ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం పక్కన విజయ పాలశీతలీకరణ కేంద్రం ఉంది. పాల కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా అసంపూర్తిగా చేపట్టారు. దీంతో 20ఫీట్ల స్థలం ఖాళీగా ఉంది. ఆ స్థలం మాదే అంటూ ఒక వర్గానికి చెందిన కొందరు కేంద్రం అధికారులతో వాదనకు దిగారు. ఈ విషయం పాల కేంద్రం అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు దీనిని అడ్డుకున్నారు. అయినా అక్కడ దానిని చదును చేసి కబ్జా చేసే ప్రయత్నంలో కబ్జాదారులు ఉన్నారు.

➪ జిల్లా కేంద్రంలోని బీరెల్లి రోడ్డు చౌరస్తాలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసి ఓ ఉద్యోగి కమర్షియల్ నిర్మాణం చేపట్టారు. ఇది పత్రికల్లో రావడంతో ప్రస్తుతం ఆ నిర్మాణాన్ని అధికారులు నిలిపి చేయించారు.

➪ సంగాల చెరువు సమీపంలో చెరువుకు చెందిన ఎకరా స్థలాన్ని కబ్జాదారులు అధికారులు, బడానాయకుల అండతో కబ్జా చేసి దానిని చదును చేసి ప్లాట్లు చేసి విక్రయించడానికి సిద్ధంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

➪ గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 42 హరిత హోటల్ ముందున్న 10శాతం లేఅవుట్ భూమిని ప్లాట్లు చేసి కబ్జాదారులు కోట్ల రూపాయలకు అమ్ముకున్నారు. గద్వాల పట్టణం మున్సిపాలిటీ పరిధిలో సర్వేనెంబర్ 917లో ఎల్పీనెంబర్ 53/71లో వేసిన వెంచర్‌లోని 10శాతం లేఅవుట్ స్థలాన్ని కొందరు కబ్జాచేసి ప్లాట్లు చేసి విక్రయించారు. ఇలా గద్వాల మున్సిపాలిటీలో ఖద్దరు నేతల కనుసన్నల్లో కోట్ల విలువ చేసే స్థలాలు కబ్జా చేస్తున్న పట్టించుకునే వారు కరువయ్యారు. హైదరాబాద్‌లో ఉన్న హైడ్రా గద్వాల మున్సిపాలిటీకి వర్తింపచేసి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

నిలిచిన పత్తిలోడ్ వాహనాలు

మూసాపేట(అడ్డాకుల), డిసెంబర్ 15 : అడ్డాకుల మండలంలోని ఎస్ఎస్‌వీ స్పిన్నర్స్ ప్రైవేట్ కంపెనీ వద్ద ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం వద్ద ఆదివారం పత్తిలోడ్ వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రంలో శని, ఆదివారాల్లో పత్తి కొనుగొళ్లు బంద్ చేస్తున్నట్లు రైతులు తెలిపారు. కొనుగోలు కేంద్రం నుంచి రెండు కిలో మీటర్లకు పైగా వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. జాతీయ రహదారిపై వాహనాలు నిలపడంతో ఎప్పుడు ఏప్రమాదం చోటు చేసుకుంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అందుకని శని, ఆదివారాల తోపాటు నిరంతరం పత్తి కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఈ విషయంపై ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి పత్తి కొనుగోళ్లు వేగవంతం చేయడం కోసం చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం నుంచి జాతీయ రహదారి పొడవునా నిలిచిన వాహనాలు

మొదటి రోజు ప్రశాంతం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన గ్రూప్-2 పరీక్షలు
- మొదటి రోజు 51,701 మంది హాజరు
- నిమిషం నిబంధనతో ఎగ్జామ్‌కు పలువురు దూరం
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులు
- 50 శాతం మాత్రమే పరీక్షలు రాసిన అభ్యర్థులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం గ్రూప్-2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులు నిర్వహించనున్న పరీక్షలో మొదటి రోజు ప్రశాంతంగా ముగిసింది. నిమిషం నిబంధన అమలు చేయడంతో పలువురు అభ్యర్థులు పరీక్షకు దూరమయ్యారు. సెంటర్ల వద్ద సిబ్బందిని వేడుకున్నా కూడా లోపలికి అనుమతించలేదు. కేంద్రాలను ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులు పరిశీలించారు. పరీక్ష తీరును పర్యవేక్షించారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన ఎగ్జామ్‌కు కేవలం 50 శాతం మంది మాత్రమే హాజరుకావడం గమనార్హం వనపర్తి జిల్లాలో 31 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. పేపర్ 1కు 8,569 మందికి గానూ 4,408 మంది.., పేపర్-2కు 4,381 మంది హాజరయ్యారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 25 కేంద్రాల్లో 8,722 మందికి గానూ పేపర్-1కు 4,316, పేపర్-2కు 4,277 మంది వచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 20,584 మంది అభ్యర్థులకు 54 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పేపర్-1కు 10,380, పేపర్-2కు 10,314 మంది హాజరయ్యారు. నారాయణపేట జిల్లాలో 3,994 మందికి గానూ ఉదయం 2,052.., మధ్యాహ్నం 2,046 మంది పరీక్ష రాశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని 32 పరీక్షా కేంద్రాల్లో 9,731 మందికి గానూ పేపర్-1కు 4,772 మంది, పేపర్-2కు 4,755 మంది హాజరయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా జేపీఎన్‌సీఈ వద్ద డీఐజీ చౌహాన్, ఎస్పీ జానకి బందోబస్తును పరిశీలిస్తుండగా.. సమయం మించిపోతుండడంతో గర్భిణి కారులో ఎక్కించుకొని హాల్ సమీపంలో వదిలిపెట్టారు.

వనపర్తి జిల్లా కేంద్రంలో అభ్యర్థులను తనిఖీ చేసి లోపలికి పంపిస్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న మహిళా అభ్యర్థులు

తేమ పేరుతో జాప్యం

- రోజుల తరబడి పడిగాపులు
- పట్టించుకోని అధికారులు
- అన్నదాతల ఆగ్రహం

పాన్‌గల్ : తేమ శాతం ఎక్కువైందని కల్లాల్లో ఆరబోసిన ధాన్యం

పాన్‌గల్, డిసెంబర్15: ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందనే ఆశతో రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే కేంద్రాల నిర్వాహకులు తేమ పేరుతో జాప్యం చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. సన్నరకం ధాన్యానికి 14శాతం, దొడ్డు రకం ధాన్యానికి 17శాతం తేమ ఉంటేనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని వారు ఖరాకండిగా చెబుతుండడంతో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి ధాన్యాన్ని ఆరబెడుతూ రాత్రిపగలూ కల్లాల వద్ద జాగరణ చేస్తున్నారు. ధాన్యం సేకరణకు హమాలీల చార్జీలు, సుత్తిలి ధారం వంటి భారం రైతులపై మోపుతున్నారు. బస్తాకు రూ.20 చొప్పున క్వింటాకు రూ.40 వసూలు చేస్తున్నారు. ధాన్యానికి ఒక పక్క మద్దతు ధర లభించక ఇబ్బందులు పడుతుంటే ఇలా అదనపు చార్జీల పేరుతో మాకేమి మిగులుతుందని రైతులు చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా లారీ లోడ్‌కు ఐదారు బస్తాలు తరుగు పేరుతో తీసివేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చెప్పేది ఒకటి చేసేది మరొకటి అని రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు.

పాన్‌గల్‌లో రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యం